నూతన ఆవిష్కరణలతోనే సాంకేతికాభివృద్ధి

ఎన్ఆర్ఎస్ఈ ఉపసంచాలకులు ఉమాదేవి



టెక్నికల్ సింపోజియం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫెస్ట్‌ల సావనీర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐ ఈటీ కళాశాలలో గురువారం 'కన్వర్జెన్స్ 2కె23ఆర్'పేరిట స్నాతకోత్సవం, 'ఎక్ఫిచో 6.0హెచ్'పేరిట సమారంభకోత్సవం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎస్ఈ ఉపసంచాలకులు ఉమాదేవి, మంత్ర ఫర్ చేంజ్ సంచాలకులు శ్రీరామ్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి కళాశాల ఉపాధ్యక్షుడు కోడె దుర్గా ప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ.. ఇస్రో స్థాపించిన విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ ద్వారా నేడు భారతదేశ ప్రగతి అంతరిక్షానికి వ్యాపించిందన్నారు. నూతన ఆవిష్కరణలతోనే సాంకేతికాభివృద్ధి సాధ్య పడుతుందన్నారు.

◆ శ్రీరామ్ మాట్లాడుతూ... తమ మంత్ర ఫర్ చేజ్ ద్వారా దీక్ష, పాఠ్యపుస్తకాలలో క్యూఆర్ కోడ్‌లు వంటివి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకోవచ్చామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

◆ అనంతరం టెక్నికల్ సింపోజియం, అంత్రప్రెనార్‌షిప్ ఫెస్ట్‌ల సావనీర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు చెన్నకేశవరావు, ప్రధాన అధ్యాపకులు డాక్టర్ సీడీ నాయుడు, విద్యార్థి పురోగతి డీన్ పద్మశాయి, వీజే హబ్ మేనేజర్ డాక్టర్ కిరణ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థుల నృత్య ప్రదర్శన



వాళ్ల చూపు కాంగ్రెస్ వైపు!

- కొలను శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో మారిన సమీకరణాలు
- కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- 28 మంది కార్పొరేటర్లలో చాలా మంది కాంగ్రెస్ వైపు మొగ్గు
- మెజార్టీ కార్పొరేటర్లు పార్టీ మారితే మేయర్ మార్పు జరిగే అవకాశం



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురు కార్పొరేటర్లు అధికార కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారు. కొలను శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నిజాంపేట్‌లో ఒక్కసారిగా రాజకీయ సమీకరణాలు మారిపోయాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

◆ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కొలను హన్మంతరెడ్డికి మద్దతుగా శ్రీనివాస్‌రెడ్డి పనిచేశారు. కాని హన్మంతరెడ్డి ఓటమి పాలయ్యాడు. అయినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది.

◆ ఇదే సమయంలో కాంగ్రెస్ నాయకులు తమకు అనుకూల పరిస్థితులు సృష్టించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇదే సమయంలో పలువురు కార్పొరేటర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎలాగూ ఐదు సంవత్సరాలు అభివృద్ధి జరగాలంటే పార్టీ మారాల్సిందేననే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

◆ బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం 28 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో చాలా మంది పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. ఇలాంటి పరిస్థితిలో మరో ప్రధానమైన అంశం కూడా చర్చకు వస్తుంది. ఒక వేళ మెజారిటీ కార్పొరేటర్లు పార్టీ మారితే మేయర్ మార్పు జరుగుతుందా? అనే విషయంపై సైతం నిజాంపేట్ ప్రజలు చర్చ సాగుతోంది.

◆ అయితే గతంలో కార్పొరేటర్ కొలను తేజశ్రీ మేయర్ పదవి ఆశించినప్పటికీ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ మాత్రం కొలను నీలారెడ్డి వైపు మొగ్గు చూపారు. దీంతో అప్పటి నుంచి అసంతృప్తితో ఉన్న కొలను శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం.. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయన వేగం పెంచినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.

◆ ఒక సంవత్సరం పాటు మాత్రమే మేయర్ పదవి కాలం ఉండటంతో కొలను శ్రీనివాస్‌రెడ్డి తన సతీమణి తేజశ్రీ కోసం అవిశ్వాసం ఆయుధం ఉపయోగిస్తారా? లేక ఏదైనా నామినేటెడ్ పదవి కోసం ప్రయత్నం చేస్తారా? అనేది ప్రస్తుతం నిజాంపేట్‌లో చర్చనీయాంశం అయ్యింది.

పార్టీ మారితే టికెట్ హామీ కావాలి ?

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరితే వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో తమకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తామనే హామీ కూడా కావాలని పలువురు కార్పొరేటర్లు మెలిక పెడుతున్నట్లు తెలుస్తోంది. మరి ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు ఈ పార్టీ ఫిరాయింపులను ఏ విధంగా నియంత్రిస్తారో అన్నది వేచి చూడాల్సిందే.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కుత్బుల్లాపూర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారుల ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సబ్ డివిజన్ ఆఫీస్ డీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఏడీఈ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సీజీఆర్ ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, ఫైనాన్స్, అధికారులు అందుబాటులో ఉంటారని వారు తెలిపారు. బిల్లుల్లో హెచ్చుతగ్గులు, దీర్ఘకాలిక విద్యుత్ సమస్యల పరిష్కరించుకోవచ్చన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం

మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్



కుత్బుల్లాపూర్: ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 15వ తేదీ నుంచి మేడ్చల్, సుచిత్ర నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు వయా కొంపల్లి, సుచిత్ర బోయిన్‌పల్లి, ప్యారడైజ్, ట్యాంక్‌బండ్, నాంపల్లి, అఫ్జల్‌గంజ్, శివరాంపల్లి, ఆరాంఘర్‌ల మీదుగా 229/95ఏ బస్సును నడుపుతున్నామని వెల్లడించారు. మొత్తం ఐదు బస్సులను ఉదయం 5.45గంటల నుంచి 6.35, 7.25, 8.15 గంటలకు, 9.05గంటలకు ప్రతి 50 నిమిషాలకు ఒక్క బస్సు చొప్పున ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. స్థానిక ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ సుధాకర్ కోరారు.

కాంగ్రెస్ నేత చంద్రశేఖర్‌గౌడ్ మృతి



చంద్రశేఖర్‌గౌడ్ ఫైల్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ నేత, న్యాయవాది నల్ల చంద్రశేఖర్‌గౌడ్(55) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ విద్యార్థి దశ నుంచి ఎన్ఎస్‌యూఐ నుంచి పార్టీలో పనిచేస్తూ వచ్చాడు. 2000 సంవత్సరంలో జీడిమెట్ల డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున కార్పొరేటర్ అభ్యర్థిగా బరిలో దిగి పోటీచేసి ఓడిపోయారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రశేఖర్‌గౌడ్ బుధవారం మధ్యాహ్నం ఓ ఫంక్షన్‌కు వెళ్లి అక్కడే కుప్పకూలిపోయారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, విజయశేఖర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ గౌరీష్, బీజేపీ నేత కూన శ్రీనివాస్‌గౌడ్, అడ్వకేట్లు జయరాం, మేడ్చల్ కోర్టు గవర్నమెంట్ లాయర్లు కమలాకర్, బర్మా చక్రపాణి, లింగారెడ్డి వెంకటరెడ్డి, తదితరులు గురువారం ఆయన అంత్యక్రియలో పాల్గొని నివాళులర్పించారు.

వృక్షాలు మోడుబారి.. ప్రమాదం పొంచి ఉంది!



రంగారెడ్డినగర్: మోడుబారిన భారీ వృక్షంతో వాహనదారులకు అపాయం పొంచి ఉంది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని చింతల్–షాపూర్‌నగర్‌ల మధ్య ఉన్న హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశాన్ని ఆనుకుని ఓ భారీ వృక్షం మోడుబారి ప్రమాదకరంగా ఉంది. పెనుగాలులు వీచినా సదరు వృక్షం రోడ్డుపై పడటం ఖాయం. ఎప్పుడు కూలుతుందో తెలియక అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఆ ప్రాంతానికి రాగానే భయంతో వెళ్లాల్సి వస్తోంది.. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు సదరు మోడుబారిన వృక్షాన్ని తొలగించి సురక్షితంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

డ్రైనేజీ లీకేజీలు.. ఫిర్యాదులు పట్టించుకోరు

పరిధి మాది కాదంటూ దాటవేస్తున్న అధికారులు



గార్డెన్ బస్తీలో రోడ్డుపై పారుతున్న మురుగు



భాగ్యలక్ష్మికాలనీ రోడ్డుపై నిలిచిన మురుగు

కుత్బుల్లాపూర్: ప్రధాన రోడ్డుపైనే డ్రైనేజీ లీకేజీలు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇది తమ పరిధి కాదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కాలనీలు మొదలుకొని ప్రధాన రోడ్లపైన డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. అభివృద్ధి పనుల పేరిట లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా మారడం మూలంగా పనులు జరిగిన మూన్నాళ్లకే ఈ సమస్య ఎదురవుతుందని ఆరోపిస్తున్నారు.

◆ కుత్బుల్లాపూర్ గ్రామంలోని గార్డెన్ బస్తీలో గత కొన్ని నెలలుగా డ్రైనేజీ రోడ్డుపై పొంగిపొర్లుతోంది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో ప్రధాన రోడ్డుపైనే డ్రైనేజీ చేరి రోడ్డుపై నడవడానికి వీలు లేకుండా తయారయ్యింది. అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

◆ జయరామ్‌నగర్ ప్రధాన రోడ్డులో ఇటీవల అధికారులు డ్రైనేజీ కోసం కల్వర్టు నిర్మాణం చేపట్టారు. భాగ్యలక్ష్మికాలనీ వైపు ఈ పనులు కొనసాగగా నిత్యం ప్రధాన రోడ్డుపైనే డ్రైనేజీ నిలిచిపోతుంది. కుత్బుల్లాపూర్ నుంచి సుచిత్రకు వెళ్లే వాహనదారులు కాలనీకి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: కొత్త ఫీడర్ ఏర్పాటు పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 33/11 కేవీ ప్రశాంత్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు బృందావన్ హిల్స్, ప్రశాంత్ హిల్స్, సైదప్ప బస్తీ, రాజధాని స్కూల్, బండారి లేఅవుట్ రోడ్ నం.10 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆహ్వానం



నిజాంపేట్: సెమీ క్రిస్మస్ వేడుకలకు రావాల్సిందిగా కోరుతూ గురువారం పాస్టర్ల సంఘం సభ్యులు నిజాంపేట్ 21వ డివిజన్ కార్పొరేటర్ కాసాని శిరీష, కాసాని వీరేష్ ముదిరాజ్‌లను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. పాస్టర్లు ప్రభుదాస్, సైమన్, వెంకటమ్మ, జలగం చంద్రయ్య, రామనర్సయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రంగారెడ్డినగర్: బీజేపీ నేత వల్లెపు కృష్ణ జయంతిని పురస్కరించుకుని గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయన సోదరుడు వల్లెపు వేణుకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, నీళ్ల బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు.



స్పందించి వినియోగంలోకి తీసుకురండి

కొరవడిన మోడ్రన్ షీ టాయిలెట్ నిర్వహణ



చింతల్ బస్టాప్ సమీపంలో నిరుపయోగంగా షీ టాయిలెట్

చింతల్: ప్రారంభ సమయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు చేసే హడావిడి అంతా.. ఇంతా కాదు. లక్షలాది రూపాయలు వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులు మూణ్నాళ్లకే పడకేస్తున్నాయి. చింతల్ ప్రధాన రోడ్డులో రూ.10 లక్షల నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన మోడ్రన్ షీ టాయిలెట్ నిర్వహణ కొరవడంతో మూడేళ్లుగా మూలకు పడింది. పట్టించుకునే అధికారులు గాలికి వదిలేయడం, ప్రజాప్రతినిధులు ఆ విషయాన్ని పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ చింతల్ లాస్ట్ బస్టాప్ వద్ద ఏర్పాటుచేసిన మోడ్రన్ షీ టాయిలెట్‌కు అత్యధిక టెక్నాలజీని అనుసంధానించారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు టాయిలెట్ మూతపడటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. టాయిలెట్‌కు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తేవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

మార్కెట్ యార్డు స్థలంపై కబ్జాదారుల కన్ను!



నిజాంపేట్ సర్వే నం. 87, 88 స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్

నిజాంపేట్: మార్కెట్ యార్డుకు కేటాయించిన స్థలం కబ్జా కోరల్లో చిక్కుకుందా.. అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. స్థానికంగా కూరగాయల మార్కెట్‌తో పాటు పలు దుకాణాల సముదాయాన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు గతంలో కమిషనర్‌గా పనిచేసిన గోపీ నిజాంపేట్ కార్పొరేషన్ 33వ డివిజన్ పరిధిలోని 87, 88 సర్వే నంబర్లలోని స్థలాన్ని కేటాయించారు. దీనికి మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో సర్వే చేయించి రేకుల షెడ్డుతో ప్రహరీని సైతం ఏర్పాటు చేశారు.

– అయితే పాలక మండలి, అధికారులు పనుల విషయంలో జాప్యం చేయడంతో ప్రస్తుతం సదరు స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. మూడు రోజుల క్రితం కొందరు వ్యక్తులు దాదాపు వేయి గజాల స్థలాన్ని చదును చేసి కంటైనర్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల సదరు స్థలంలో భవన నిర్మాణానికి పునాదులు సైతం తీశారు. అయితే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చేస్తున్న అభివృద్ధి పనులా.. లేక కబ్జాదారుల పనా అన్నది స్థానికంగా చర్చనీయాంశమైంది. కబ్జా అయితే వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆశ.. నిరాశ



రింగ్ బస్తీలో విద్యుత్ స్తంభాలు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రింగ్ బస్తీలో ఉన్న ప్రజలకు ఎంతో కాలం నుంచి విద్యుత్ సమస్య ఉండేది. సుమారు 500 మీటర్ల దూరంలో ప్రభుత్వ పాఠశాల దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కనెక్షన్ తీసుకుంటున్నారు. ఈ సమస్యపై పలు ఫిర్యాదులు రావడంతో రెండు నెలల క్రితం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. కానీ ఆ తర్వాత ఎలాంటి పనులు చేయకపోవడం స్థానికులు నిరాశతో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఓయూ సాహిత్య వేదిక వార్షికోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సాహిత్య వేదిక 6వ వార్షికోత్సవం కవులు, కళాకారులు, రచయితలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో పాటలు, పద్యాలు, వచన కవితలతో సాహిత్యాభిలాషులను అలరించారు. తెలుగుశాఖ అధ్యాపకులు ప్రొ.కాశీం, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, అక్కిరాజు రామకృష్ణారావు, యామిని, రమేష్, రేలారే గంటా తదితరులు పాల్గొని మాట్లాడారు.

'డబుల్' ఇళ్ల ప్రగతిపై ప్రతివారం సమావేశం


మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ జిల్లాలోని శాసనసభ నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, పంచాయతీరాజ్ ఈఈ సుమేధా, ఆర్డీవోలు శ్యాంప్రకాశ్, రాజేశ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ), సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు పడక గదుల నిర్మాణాలకు సంబంధించి అన్ని వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఏమాత్రం పెండింగ్ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.


◆ ఇప్పటి వరకు ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తయ్యాయి..? ఎన్ని ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు..? ఇంకా ఎన్ని ఇళ్లు ఏ దశలో పెండింగ్ పనులు ఉన్నాయి? ఫినిషింగ్ దశలో ఎన్ని ఉన్నాయనే పూర్తి వివరాలను నియోజకవర్గాల అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందజేసే డబుల్ ఇళ్లను తప్పకుండా అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం అందజేయాలని సూచించారు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల కేటాయింపులకు సంబంధించిన వివరాలు, పంపిణీ ప్రక్రియను తెలుసుకున్నారు. రాజీవ్ గృహకల్ప ఇళ్లపై ఆయన ఆరా తీశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికారులు డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై పూర్తిస్థాయిలో మానిటరింగ్ చేయాలని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని, సమావేశానికి అధికారులు సమగ్ర సమాచారంతో తప్పకుండా హాజరుకావాలన్నారు. అర్హులకు అందజేయనున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు శ్యామ్ ప్రకాశ్, రాజేశ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం 300 ఇళ్లతో బస్తీ నిర్మాణం

ఎన్నికల బిజీలో అధికారులు.. బస్తీ ఏర్పాటులో కబ్జారాయుళ్లు



వారం రోజుల క్రితం సర్వే నం.342లో నిర్మాణాలు



ప్రస్తుతం సర్వే నం.342లో నిర్మాణాలు

సుభాష్‌నగర్: నెల రోజుల క్రితం అక్కడ ఖాళీ స్థలం... ప్రస్తుతం 300 నిర్మాణాలతో బస్తీ ఏర్పాటు. ఇదేదో ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు అనుకుంటున్నారా.? అయితే మీరు పొరపడినట్లే... ఆ స్థలంలో కబ్జారాయుళ్లు గద్దళ్ల వాలిపోయి 30రోజుల్లో అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. సంబంధిత అధికారులు ఎన్నికల విధుల్లో బిజీలో ఉండగా, కబ్జారాయుళ్లు రాత్రి పగలు తేడా లేకుండా తన పనిని కానిచ్చేశారు.

◆ గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్ ప్రధాన రహదారి ఆనుకొని హనుమాన్ ఆలయానికి ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 342లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జారాయుళ్లు కనుమరుగు చేశారు. ఈ కబ్జాల వెనుక ఓ కుల సంఘం పెద్ద ఉండి ఈ తతంగాన్ని నడుపుతున్నాడు. ఆ వ్యక్తి కింద నలుగురు చిన్నపాటి కబ్జారాయుళ్లను ఉంచి 30 ఎకరాలలో 60 గజాల చొప్పున ప్లాట్లు చేసి, సదరు ప్లాట్లను అమాయకులకు లక్షలకు విక్రయించి కేవలం 30 రోజుల్లోనే కోట్లు గడించాడు. కానీ సంబంధిత అధికారులు ఎన్నికల బిజీ నుంచి వైదొలిగిన ఈ నిర్మాణాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

హెచ్ఎండీఏకు అప్పగింత.....

సర్వే నం.342లోని కబ్జాల బాగోతాన్ని నవంబర్ 1న 'సాక్షి'వెలుగులోకి తీసుకురాగా అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ హరీష్ అదేరోజు సదరు స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఉన్న నిర్మాణాలను అలాగే ఉంచి, మిగతా స్థలంలో నిర్మాణాలు కాకుండా 342లోని 45 ఎకరాలను హెచ్ఎండీఏకు అప్పగిస్తు అధికారులను ఆదేశించారు. తదనంతరం కొన్ని నెలల పాటు మౌనంగా ఉన్న కబ్జారాయుళ్లకు ఆ కుల సంఘం పెద్ద వెన్ను తట్టి వారిని ప్రోత్సహిస్తూ వందల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టారు.

నేను చూసుకుంటా...

తనకు అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ తెలుసు. తాను చెప్పిందే వేదం అంటూ ఆ కుల సంఘం పెద్ద అన్ని దగ్గర ఉండి చూసుకున్నారు. ముందస్తుగా ఆ నలుగురి కబ్జారాయుళ్ల వద్ద నుంచి 70 ప్లాట్లు తన ఖాతాలోకి వేసుకొని అమ్ముకున్నాడు. ప్రస్తుతం పోలీసు, రెవెన్యూ, జర్నలిస్టు, ప్రజాప్రతినిధుల పేరిట ప్లాటుకు లక్ష నుంచి రూ.2లక్షలు వసూలు చేసే పనిలో పడ్డాడు. గతంలో దేవేందర్‌నగర్‌లోని చాలా చోట్ల ఒక్క ప్లాట్ నలుగురి విక్రయించి అమాయకులను మోసం చేసిన ఘనత ఆయనకు ఉంది. ఇక అధికారులు సదరు వ్యక్తిపై ఏమి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

చెరువులోకి దూకి వ్యక్తి ఆత్మహత్య



సురేష్ మృతదేహం

దుండిగల్: చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతదేహాన్ని దుండిగల్ పోలీసులు వెలికి తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ న్యూక్వార్టర్స్‌లో ఉండే ఆంజనేయులు, లక్ష్మిల కుమారుడు సురేష్(30) గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 13వ తేదీన ఉదయం 6గంటలకు డ్యూటీకి వెళ్లిన సురేష్ ఆరోగ్యం సరిగా లేదని 8గంటల ప్రాంతంలో పర్మిషన్ తీసుకుని ఇంటికి వచ్చాడు. అనంతరం తన అత్తను గండిమైసమ్మ చౌరస్తాలో దింపాడు.

◆ ఈ క్రమంలో తల్లి లక్ష్మికి ఫోన్ చేసి తాను చెరువులో దూకి చనిపోతానని బెదిరించాడు. అయితే ఇదే మాదిరిగా పలుమార్లు కుమారుడు బెదిరింపులకు పాల్పడటంతో లక్ష్మి సీరియస్‌గా తీసుకోలేదు. నీకు ఇష్టం వచ్చినట్లు చేయమని ఫోన్ కట్ చేసింది. ఇదే క్రమంలో భార్యకు సైతం ఫోన్ చేసిన సురేష్ తాను చనిపోతున్నట్లు చెప్పాడు. కోడలి నుంచి ఫోన్ రావడంతో వెంటనే డీపోచంపల్లిలోని చెరువు వద్దకు చేరుకోగా అప్పటికే చెరువు గట్టుగా కుమారుడు బైక్, చెప్పులు, బట్టలు కనిపించాయి.

◆ సమాచారం అందుకున్న పోలీసుల ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభించలేదు. గురువారం ఉదయం చెరువులో మృతదేహం తేలడంతో పోలీసులు బయటకు వెలికి తీశారు. అయితే ఫిట్స్‌లో బాధ పడుతున్న తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకటేష్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ డబీల్‌పూరాకు చెందిన వెంకటేష్(34) గురువారం డ్యూటీ నిమిత్తం తన బైక్‌పై గుండ్ల పోచంపలి వైపు వస్తుండగా మార్గమధ్యలో కొంపల్లిలోని రాజరాజేశ్వరి ఆలయం వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ అతడి వాహనాన్ని ఢీకొట్టింది. వెంకటేష్ పై నుంచి టిప్పర్ వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చలి పెరిగే.. చలిమంట వేసుకునుడే..



సుభాష్‌నగర్: రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి పంజా విసురుతోంది. సాయంత్రం సూర్యాస్తమయం కాకముందే అమాంతం చలి పెరగడంతో జనం జంకుతున్నారు. చాలా వరకు స్వెటర్లు ధరించనిదే బయటకు రాలేక పోతున్నారు. మరి కొన్ని చోట్ల చలి మంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు.

చలిమంట వేసుకున్న ఓ వ్యక్తి